ప్రతి ధాన్యం గింజ కొనేందుకు ప్రభుత్వం చర్యలు

- మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి
- తుపాను ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పార్థసారథితో కలిసి పర్యటన



మద్దూరులో తడిచిన ధాన్యం పరిశీలిస్తున్న ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే పార్థసారథి

కంకిపాడు: రైతు పండించిన ప్రతి ధాన్యం గింజ కొనేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. తుపాను ప్రభావంతో ముంపునకు గురైన మద్దూరు, కాసరనేనివారిపాలెంలోని పంట పొలాలు, తడిచిన ధాన్యం రాశులను ఎమ్మెల్యే కొలుసు పార్థసారథితో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ధాన్యం ఆరబోస్తున్న రైతులను పలకరించి పంటకు పెట్టిన పెట్టుబడులు, దిగుబడుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తుపానుతో ఏర్పడిన నష్టాన్ని గురించి వివరాలు సేకరించారు. ఎంపీ బాలశౌరి మాట్లాడుతూ తుపాను కారణంగా చేతికొచ్చిన పంట దెబ్బతినిని రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకునేందుకు సిద్ధంగా ఉందని ఇప్పటికే ధాన్యం సేకరణ, పంట నష్టం అంచనాలపై అధికారులకు ప్రత్యేక ఆదేశాలిచ్చిందని తెలిపారు. విపత్తుల సమయంలో రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వం కూడా సహాయ సహకారాలను అందించాల్సి ఉందని పేర్కొన్నారు. పార్లమెంటు సమావేశాల్లో తుపాను ప్రభావంతో ఏర్పడిన నష్టాన్ని తెలియజేసి తగు సాయం అందేలా కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి మాట్లాడుతూ ధాన్యం రవాణా సవ్యంగా సాగేలా చూడాలని నిబంధనల పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని చెప్పారు. పంట నష్టం అంచనాలను సమర్థంగా రూపొందించాలని, పంట దెబ్బతిన్న ప్రతి రైతుకీ ప్రయోజనం చేకూరాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బాకీ బాబు, టిడ్కో డైరెక్టర్ పి.రాఘవరావు, పార్టీ మండల అధ్యక్షుడు మద్దాలి రామచంద్రరావు, సర్పంచ్ చిప్పల రామదాసు, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు, నాయకులు ఎ.డేవిడ్, వేమూరి రాజా, జె.నాని తదితరులు పాల్గొన్నారు.



పోరంకిలో పంట పొలాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ సునీల్, ఏవో శైలజ

పంట పొలాలు పరిశీలించిన అధికారులు

పెనమలూరు: తుపానుతో దెబ్బతిన్న వరి చేలను వ్యవసాయ శాఖ అధికారులు గురువారం పరిశీలించారు. పోరంకి గ్రామంలో దాదాపు 800 ఎకరాల వరి పంట తుపాను కారణంగా దెబ్బతింది. ఏడీఏ సునీల్, మండల ఏవో శైలజ పంట పొలాలు పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. పంట పొలాల నుంచి నీరు బయటకు తోడాలని సూచించారు. అధికారులు ఎన్యూమరేషన్‌కు వచ్చిన సమయంలో పంట నష్టం వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులు వచ్చిన తర్వాత పంట నష్టంపై సాయం వివరాలు వెల్లడిస్తామని అన్నారు.



కూరగాయల పంటలు పరిశీలిస్తున్న హార్టికల్చర్ అధికారి హరిచంద్

ఉద్యాన పంటలు పరిశీలన...

గన్నవరం రూరల్: మండలంలోని సూరంపల్లి, మాదలవారిగూడెం గ్రామాల్లో హార్టికల్చర్ అధికారి హరిచంద్ గురువారం పర్యటించారు. వర్షాలకు దెబ్బతిన్న బీర, మునగ, క్యాబేజీ పంటలను ఆయన పరిశీలించి రైతాంగానికి పలు సూచనలు చేశారు. పొలంలో అధికంగా ఉన్న నీటిని వెంటనే బయటకు పంపించాలని, వాలిపోయిన మొక్కలను నిలబెట్టి మొదలు చుట్టూ మట్టిని ఎగవేయాలని సూచించారు. ఉరకెత్తి తలలు వాల్చితే తేరుకోవడానికి లీటరు నీటికి 10 గ్రాములు యూరియా కలిపిన ద్రావణాన్ని వారంలో రెండు సార్లు పిచికారి చేయాలని తెలిపారు. పర్యటనలో హెచ్ఏ దీక్షా, రైతులు పాల్గొన్నారు.

కచ్చితమైన అంచనాలు రూపొందించాలి...

హనుమాన్‌జంక్షన్ రూరల్: తుఫాన్‌తో నష్టపోయిన పంటల వివరాలను పూర్తిగా పరిశీలించి కచ్చితమైన ప్రాథమిక అంచనాలను రూపొందించాలని వ్యవసాయ శాఖ గన్నవరం ఏడీ సునీల్ ఆదేశించారు. బాపులపాడు మండలం శేరినరసన్నపాలెంలో నీట మునిగిన వరి పొలాలను గురువారం ఆయన పరిశీలించారు. ధాన్యం తడిపోవడం, రంగు మారడం, మొలకెత్తడం వల్ల తీవ్రంగా నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రభుత్వానికి నివేదికలు ఇస్తామని ఏడీ సునీల్ తెలిపారు. సర్పంచ్ అడపా అంజిబాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు చిర్రా అంజిబాబు, మండల ఏవో జొన్నలగడ్డ భవాని పాల్గొన్నారు.

నున్న గ్రామంలో...

నున్న(విజయవాడరూరల్): తుఫాను కారణంగా కురిసిన వర్షాలకు నేలవాలిన పంట పొలాలను వ్యవసాయశాఖ ఏడి బి.వెంకటేశ్వరావు, మండల ఏవో బి.రంగనాథ్‌బాబు గురువారం పరిశీలించారు. ఏవో రంగనాథ్‌బాబు మాట్లాడుతూ వరికంకులు తడిస్తే మానుగాయ వచ్చే వీలుంది కాబట్టి టిల్ట్ అనే మందును 1 గ్రాము లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. నున్న గ్రామంలో వరికోతకు సిద్ధంగా ఉన్న వరిపొలం దాదాపు 400 ఎకరాల్లో నేలవాలిందని చెప్పారు. నష్టం వాటిల్లిన ప్రతీ రైతును రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని ఆయన తెలియజేశారు.

బుద్ధవరం గ్రామంలో...

గన్నవరం: మండలంలోని బుద్ధవరం గ్రామంలో తుపాను కారణంగా నీట మునిగిన పంట పొలాలను వ్యవసాయ శాఖ అధికారులు గురువారం పరిశీలించారు. మండల ఏవో ఎస్ఎల్ తేజస్వి రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పంటలను కాపాడుకునే విషయమై రైతులకు ఆమె సలహాలు, సూచనలు ఇచ్చారు. ముందుగా పొలాల్లో నీటిని ఆయిల్ ఇంజన్ల ద్వారా బయటకు తరలించాలని సూచించారు. తడిసిన ధాన్యం మొలకెత్తకుండా ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయాలని తెలిపారు. తుపానుతో దెబ్బతిన్న నష్టాన్ని లెక్క కట్టి ప్రభుత్వానికి నివేదించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు జీ సాగర్, ఎల్ ప్రేమ్‌చంద్, పీపీసీ ఇంచార్జ్ కె. బాలాజీ పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఏవో తేజస్వి



శేరినరసన్నపాలెంలో నేలవాలిన వరి పంటను అధికారులకు చూపుతున్న రైతులు



నున్న గ్రామంలో నేలవాలిన పంటను పరిశీలిస్తున్న అధికారులు

క్లుప్తంగా

పొంచి ఉన్న ప్రమాదం



పెనమలూరు: పెనమలూరు–చోడవరం రోడ్డులో ప్రమాదం పొంచి ఉంది. జెండా చెట్టు సెంటర్ వద్ద రోడ్డు పక్కనే గుంత పడి ప్రమాదకరంగా మారింది. ఇక్కడ మురుగునీరు పారుదలకు కల్వర్టు ఉంది. కల్వర్టు వద్ద తరచుగా నీరు నిలవడంతో గుంత తవ్వారు. అయితే తుపాను కారణంగా మురుగునీరు ఒక్కసారిగా వచ్చి పడటంతో రోడ్డు పక్కనే ఉన్న గుంత కనబడటం లేదు. ప్రమాదాలు జరగకుండా విరిగిన కొమ్మలు అడ్డంగా వేశారు. రాత్రి సమయాల్లో ఇక్కడ రోడ్డు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. వెంటనే మరమ్మతులు చేసి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రామలింగేశ్వరునికి పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): కార్తిక మాసోత్సవాల్లో భాగంగా ముత్యాలంపాడు పార్వతీసమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో గురువారం స్వామివారికి బాదంపప్పుతో విశేషంగా పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రీతికరమైన మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, బిల్వార్చనలతో పాటు బాదంపప్పుతో పూజలు చేసి అలంకారం చేశారు. వాతావరణం అనుకూలించటంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. మహిళలు ఆలయంలో దీపారాధనలు చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు డీవీఎస్ రాజు, శివ రామరాజు, ఐఎస్ఎన్ రాజు పర్యవేక్షించారు.

రేపు కవి సంధి వినూత్న సాహిత్య కార్యక్రమం



విజయవాడ కల్చరల్: కేంద్ర సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో 9 వ తేదీ శనివారం సాయంత్రం కవి సంధి పేరుతో వినూత్న సాహిత్య కార్యక్రమం జరుగుతుందని కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు కన్వీనర్ డాక్టర్ మృణాళిని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బందరురోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో నిర్వహించే కార్యక్రమంలో కవి ఖాదర్ మోహిద్దీన్‌తో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యుడు ప్రసేన్ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో కవి స్వీయకవితా గానం చేస్తారన్నారు. కవిత్వంపై సభికులు ఆయనతో ముఖాముఖి పాల్గొనవచ్చన్నారు.

వరకట్న వేధింపు కేసు నమోదు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు ఇందిరానగర్–1కు చెందిన యువతికి గత ఏడాది జూన్‌లో రణస్థలం మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన గుండు సాయికుమార్‌తో పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. పెళ్లి సమయంలో కట్న కానుకలు ఇచ్చారు. భర్త విజయవాడలో ప్రైవేటు ఉద్యోగం చేస్తాడు. అయితే భర్త దురలవాట్లకు బానిసయి పందేలు కడుతూ అప్పుల పాలయ్యాడు. కట్నం కింద ఇచ్చిన ఆస్తులు అమ్మాలని, అదనపు కట్నం తీసుకురావాలని భార్యను వేధించసాగాడు. దీనికి తోడు అత్తమామలు నాగరాజు, లక్ష్మిలు కూడా వేధిస్తుండటంతో గత 9 నెలల క్రితం బాధితురాలు పుట్టింటికి వచ్చేసింది. తనకు న్యాయం చేయాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు అత్తింటివారిపై కేసు నమోదు చేశారు.

కౌలు రైతులను ఆదుకోవాలి

కంకిపాడు: తుపానుతో పంట నష్టపోయిన కౌలు రైతులను ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి తాడంకి నరేష్ కోరారు. కౌలు రైతులను ఆదుకోవాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయ అధికారులకు గురువారం వినతిపత్రం అందించారు. నరేష్ మాట్లాడుతూ నిబంధనలు పక్కనపెట్టి ధాన్యం కొనుగోలు చేయాలని ఎకరాకు రూ. 30వేలు పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు వి.మరియదాసు, జె.రవి, జాన్‌మోజేస్, వై.జోజి, వెంకటేశ్వరరావు, వి.ఉమా, ఏ.భాస్కర్‌రావు, యుగంధర్ పాల్గొన్నారు.

కేసరపల్లి వార్డు సభ్యుడిగా శ్రీధర్‌బాబు



కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి గ్రామపంచాయతీ ఒకటవ వార్డు సభ్యుడిగా జాస్తి శ్రీధర్‌బాబు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీమౌనిక అధ్యక్షతన పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు శ్రీధర్‌బాబుతో పంచాయతీ కార్యదర్శి మౌనిక ప్రమాణ స్వీకారం చేయించారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు నవంబర్ 3న ఒకటవ వార్డుకు నిర్వహించిన రీకౌంటింగ్‌లో శ్రీధర్‌బాబు ఏడు ఓట్లు మెజార్టీతో విజయం సాధించారు. గతంలో ఎన్నికల కౌంటింగ్‌లో జరిగిన అవకతవకలపై సుదీర్ఘకాలం న్యాయ పోరాటం చేసి అంతిమంగా విజయం సాధించినట్లు శ్రీధర్‌బాబు తెలిపారు. గ్రామాభివృద్ధికి తనవంతు పూర్తి సహాయ, సహకారాలు అందిస్తానని చెప్పారు. అనంతరం జాస్తిని సర్పంచ్‌తో పాటు వైస్ ఎంపీపీ కాలగడ్డ శివనాగరాజకుమారి, ఉప సర్పంచ్ గద్దం అంకమ్మ, పాలకవర్గ సభ్యులు సత్కరించారు. సమావేశంలో గ్రామాభివృద్ధికి సంబంధించి పలు తీర్మానాలు చేశారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ పొట్లూరి బసవరావు, ఎంపీటీసీ సభ్యురాలు మరీదు లక్ష్మీదుర్గ, శొంటి కిషోర్, జాస్తి సత్యనారాయణ, రాజులపాటి శ్రీనివాసరావు, సోమయ్య, జంపన బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పలకు అన్నప్రసాద వితరణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): పసుపుతోట దత్తసాయి మందిరంలో గురువారం అయ్యప్పలకు అన్నప్రసాద వితరణ జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. శ్రీసాయినక్షత్రమాలిక మండలి ఆధ్వర్యాన పారాయణం జరిగింది. అనంతరం సుమారు 500 మంది స్వాములు, 300 మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాలను మందిర వ్యవస్థాపకులు తంగెళ్ళమూడి వీర మోహనరావు పర్యవేక్షించారు.

పెనమలూరులో 4,158 ఎకరాల పంట మునక



చోడవరంలో నీట మునిగిన వరి పంట



పంట పొలాల్లో నీరు వెళ్లటానికి తూడు తొలగిస్తున్న దృశ్యం

- పంట పొలాల్లోనే ఉన్న 11,500 మెట్రిక్ టన్నుల దిగుబడి
- 1,500 మెట్రిక్ టన్నుల దిగుబడి పూర్తిగా నష్టం

పెనమలూరు: తుపానుతో పెనమలూరు మండలంలో వరి పంటకు అపార నష్టం కలిగింది. అధికారుల ప్రాథమిక పరిశీలనలో దాదాపు 4,158 ఎకరాల వరి పంట నీట మునిగినట్లు గుర్తించారు. మండల పరిధిలో సార్వ వరిసాగు 5,600 ఎకరాల్లో జరిగింది. ఎక్కువ మంది రైతులు 1,061 రకం వరి 3వేల ఎకరాల్లో సాగు చేయగా 1,318 విత్తనంతో పాటు పలు రకాల వరి సాగుచేశారు. అధికారుల లెక్కల ప్రకారం మండల పరిధిలో 15వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రావాలి. తుపానుకు ముందు 1,347 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు తరలించారు. ఇంకా 2,200 మెట్రిక్ టన్నుల ధాన్యం పొలాల వద్ద రాశులుగా ఉంది. పొలాల్లో 11,500 మెట్రిక్ టన్నుల పంట కోతలు కోస్తేనే ధాన్యం దిగుబడి బయటకు వచ్చే పరిస్థితి ఉంది. ఈ లోపు తుపాను విరుచుకుపడటంతో పంట పొలాలు పూర్తిగా నీట మునిగాయి. దాదాపు 4,158 ఎకరాల పంట ప్రస్తుతం నీటిలో ఉంది. ప్రధానంగా 1,061 రకం వరి వర్షాలు, ఈదురుగాలులు కారణంగా పూర్తిగా నేలమట్టమయింది.

పంట కాపాడుకోవడానికి రైతులు యత్నం...

నీట మునిగిన పంటను కాపాడుకోవడానికి రైతులు నానా తంటాలు పడుతున్నారు. కాలువల్లో గుర్రపు డెక్క తొలగిస్తున్నారు. మోటర్లు ఏర్పాటు చేసి పొలాల్లో నీరు బయటకు తోడుతున్నారు. తడిచిన ధాన్యం రాశులను ఎండ పెడుతున్నారు. పొలాల్లో నీరు బయటకు వెళ్తే వారం రోజుల తర్వాత పంట కోతలు కోయాల్సి ఉంది.

దిగుబడి తగ్గే అవకాశం...

మండల పరిధిలో అధికారుల లెక్కల ప్రకారం దిగుబడి 15వేల మెట్రిక్ టన్నులు ఉంది. అయితే పంట నీటిలో నాని విత్తనాలు రాలిపోవడంతో 1500 మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం దిగుబడి తగ్గుతుందని అధికారులు తెలుపుతున్నారు. దాదాపు రూ. 3.45కోట్ల విలువ చేసే వరి పూర్తిగా నీటి పాలయింది. 15వేల మెట్రిక్ టన్నులకుగాను 13వేల మెట్రిక్ టన్నుల దిగుబడి మాత్రమే వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

తక్షణ చర్యలు చేపట్టాలి...



రైతులు తక్షణ చర్యలు చేపడితే నష్టం తగ్గించుకో వచ్చని ఏడీఏ సునీల్ తెలిపారు. పంట పొలాల్లో నీరు బయటకు తోడాలని పనలు ఆరబెట్టుకోవాలి సూచించారు. తడిచిన ధాన్యం మొలకెత్తకుండా లీటరు నీటిలో 50గ్రాముల ఉప్పు ద్రావణం పిచికారి చేయాలన్నారు. ప్రభుత్వం ఆదేశించిన వెంటనే పంట నష్టంపై ఎన్యూమేషన్ చేస్తామని చెప్పారు. అయితే ప్రాథమికంగా వీఏఏ, వీఆర్వోలు పంట నష్టం వివరాలు సేకరిస్తున్నారని పేర్కొన్నారు.

ఏడీఏ సునీల్

సంక్షేమ పథకాలపై అవగాహన



డ్రోన్‌తో అవగాహన కల్పిస్తున్న ఏవో మాధురీకిరణ్



ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యత, ప్రణామం చేస్తున్న ఎంపీడీవో

ఉంగుటూరు: ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించడమే లక్ష్యంగా వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కొనసాగుతోందని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. ఆత్కూరు, పొట్టిపాడు గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర గ్రామ సభలు గురువారం జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వాటి ఉపయోగాలు వివరించి ఎవరు అర్హులు అవుతారో తెలియజేశారు. ఆయుష్మాన్ భారత్, పీఎంజేఏవై, పీఎం గరీబ్‌కల్యాణ్, కిసాన్ క్రెడిట్‌కార్డ్, నానో ఎరువులు తదితర పథకాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయం మండల శిక్షకురాలు ఎం.సులోచన ప్రకృతి వ్యవసాయం చేయడం వలన కలిగే ఉపయోగాలను వెల్లడించారు. అలాగే తక్కువ స్థలంలో మొక్కలు(కిచెన్‌గార్డెన్) పెంచుకునే విధానాన్ని తెలిపారు. ఐసీఆర్పీ రాధిక బీజామృతం గురించి చెప్పారు. కార్యక్రమంలో పొట్టిపాడు, ఆత్కూరు సర్పంచ్‌లు కత్తుల జ్యోతి, భూతపాటి ఎస్తేరమ్మ, ఈవోపీఆర్డీ బాషా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పునాదిపాడు ఆర్బీకే పరిధిలో...

కంకిపాడు: మండలంలోని పునాదిపాడు ఆర్బీకే పరిధిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా డ్రోన్ వినియోగించి ఉప్పు నీటి ద్రావణం పిచికారిపై గురువారం ఏవో మాధురీ కిరణ్ అవగాహన కల్పించారు. నేలవాలిన వరి పొలాలుపై డ్రోన్‌తో ఉప్పునీటి ద్రావణం పిచికారి, పంటలకు కలిగే మేలును వివరించారు. కార్యక్రమంలో వీఏఏ కె.పావని, గ్రామ రైతులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమ పాలన సాధ్యం



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ, సర్పంచ్

కంకిపాడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమ పాలన సాధ్యమని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండలంలోని వేల్పూరు గ్రామంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం గురువారం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామ సచివాలయాన్ని సందర్శించి, సంక్షేమ పాలనపై లబ్దిదారులతో సమీక్షించారు. అనంతరం సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ రాజకీయాలకు తావులేకుండా పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వం మాత్రమేనని అన్నారు. సంక్షేమం, అభివృద్ధిని కాంక్షిస్తూ ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, సర్పంచ్ చెన్నుబోయిన శివనాగేంద్రమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు మద్దాలి రామచంద్రరావు, ఏఎంసీ వైస్‌ఛైర్మన్ మాదు వసంతరావు, మాజీ సర్పంచ్ చెన్నుబోయిన జయరాం, పార్టీ నాయకులు చెన్నుబోయిన సుబ్బారావు, కొఠారి సాంబశివరావు, నందం శ్రీను, ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

కేసరపల్లిలో...

గన్నవరం: మండలంలోని కేసరపల్లి శివారు వెంకట నరసింహాపురం కాలనీలోని గ్రామసచివాలయం-2లో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీమౌనిక అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సంక్షేమ పథకాల బోర్డును జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి ఆవిష్కరించారు. అనంతరం ఎలిజబెత్‌రాణి మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా జగనన్న ప్రభుత్వం సంక్షేమ ఫలాలను అందజేస్తోందని పేర్కొన్నారు. గ్రామసచివాలయం-2 పరిధిలోని ప్రజలకు గత నాలుగున్నరేళ్లలో డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ. 6.54కోట్లు లబ్ధి చేకూరినట్లు తెలిపారు. ఈవోపీఆర్డీ పి.వెంకటేశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి మౌనిక, పలువురు పాలకవర్గ సభ్యులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో పటమట విద్యార్థిని ప్రతిభ

పటమట(విజయవాడతూర్పు): విద్యార్థులు చదువులతోపాటు క్రీడల్లోనూ రాణించాలని పటమట ఎస్ఆర్ఐ ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాల డైరెక్టర్ కొమ్మా చైతన్య రెడ్డి అన్నారు. పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని స్నేహప్రియ ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ గుర్తింపు పొందిన జేకే గుజు కరాటే అకాడమీ నిర్వహించిన జాతీయస్థాయి కరాటే పోటీలలో ఉత్తమ ప్రతిభ చూపినందుకు అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో కటా విభాగంలో స్నేహప్రియ రెండవ స్థానం సాధించి రజిత పతకం కైవసం చేసుకుందని చెప్పారు. తాను చదువుతున్న పాఠశాలకు, తల్లిదండ్రులకు ఉన్నతమైన ఖ్యాతి తెచ్చి విద్యార్థులకు స్ఫూర్తి నింపిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.లక్ష్మణరావు, వైస్ ప్రిన్సిపాల్ కె.సునీత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





ప్రియతమ నేతకు ఆత్మీయ స్వాగతం

దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. దుర్గమ్మను దర్శించుకున్న సీఎంను వేద పండితులు ఆశీర్వదించారు. జగనన్న పర్యటన నేపథ్యంలో ప్రదర్శించిన కేరళ సంప్రదాయ నృత్యాలు, తెలంగాణ కొత్తగూడెం గిరిజనుల కొమ్ముకోయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రియతమ నేతకు ఆత్మీయంగా స్వాగతం పలికారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

మండల పరిషత్‌కు చేరుకున్న స్పోర్ట్స్ కిట్లు



గన్నవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'ఆడుదాం ఆంధ్ర' పోటీలు మండలంలో ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో స్పోర్ట్స్ కిట్లు మండల పరిషత్ కార్యాలయానికి గురువారం చేరుకున్నాయి. స్పోర్ట్స్ కిట్లను ఎంపీడీవో ఇ.సత్యకుమార్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రలో భాగంగా క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, షటిల్ డబుల్స్ క్రీడల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల నిమిత్తం మండలంలోని గ్రామ సచివాలయాలకు స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గ క్రీడా సమన్వయకర్త ధనియాల నాగరాజు, కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ కాట్రు రాజేష్, సిబ్బంది బాజీ తదితరులు పాల్గొన్నారు.

పెనమలూరుకి చేరిన స్పోర్ట్స్ కిట్లు...

పెనమలూరు: పెనమలూరు మండల కార్యాలయానికి స్పోర్ట్స్ కిట్లు గురువారం చేరాయి. ఎంపీడీవో సునీతాశర్మ మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర పోటీలకు క్రీడాకారులు ఆయా సచివాలయాల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో లోయ శివశంకర్, ఎంఈఓలు కనకమహాలక్ష్మి, శేషగిరిరావు, సిబ్బంది పాల్గొన్నారు.